క్లుప్తంగా

సమాజంలో సేవతోనే గుర్తింపు



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ తదితరులు

కడ్తాల్: సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ పుట్టిన రోజు సందర్భంగా పలు చోట్ల మొక్కల నాటడంతో పాటు, గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, మాజీ ఎంపీటీసీ ప్రియారమేశ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు లాయక్‌అలీ, నర్సింహ పాల్గొన్నారు.

శ్రీరంగాపురం కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక



తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని శ్రీరంగాపురం కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పున్న గణేష్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారిగా ఎల్.రవీందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా పిన్నపరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య సలహాదారులుగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కామరాజు, కార్యనిర్వాహక సభ్యులుగా రవీందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, అంజయ్య, నరేష్, అనిల్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

కాలనీ సంక్షేమానికి వితరణ



చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సాయిబాలాజీ కాలనీ సంక్షేమానికి నిరంతరం తోడ్పాటునందిస్తానని ఆదిబట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పైయిళ్ల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఈ సందర్భంగా బొంగ్లూర్‌లోని సాయిబాలాజీ కాలనీ సంక్షేమానికి రూ.40 వేల చెక్కును పాలకవర్గానికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, నాయకులు మర్రి రాంరెడ్డి, ఈర్లపల్లి వెంకట్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, పాండు పాల్గొన్నారు.

మైసిగండిలో నాయకుల పూజలు



కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మను ఆదివారం మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్ గుప్తా, దశరథ్‌నాయక్, ఆనంద్ ఉన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత



జెడ్పీ హైస్కూల్‌లో వాటర్ ఫిల్టర్‌ను అందజేస్తున్న జీవన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి అందించేందుకు గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు మొగుళ్ల జీవన్‌రెడ్డి రూ.లక్ష వ్యయంతో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేయించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పాఠశాలలో వాటర్ ఫిల్టర్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు భాస్కర్, ప్రవీణ్, సురేఖ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు అశోక్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, భాస్కర్, సురేందర్, కొండల్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: క్యాంపు కార్యాలయంలో వేడుకల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కడ్తాల్: విద్యార్థులతో కలిసి ర్యాలీలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఇబ్రహీంపట్నం: మున్సిపల్ కార్యాలయంలో..



మంచాల: ఆరుట్లలో రాష్ట్ర విద్య శాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

వాడవాడలా మువ్వన్నెల మురిపెం

వాడవాడలా గణతంత్ర దినోత్సవ సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం ఉదయమే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు రాజ్యాంగ ఆవశ్యకతపై ఉపన్యాసించారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో పెద్దఎత్తున వేడుకలు నిర్వహించారు. పలు పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది.

– సాక్షి, నెట్‌వర్క్



తుర్కయంజాల్: జెండా ఆవిష్కరణలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మారుతి రాంప్రసాద్



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ కార్యాలయం వద్ద..



అబ్దుల్లాపూర్‌మెట్: రైతుసేవా సహకార సంఘంలో జెండావిష్కరణలో చైర్మన్ భరత్



ఆమనగల్లులో జెండా ఎగురవేస్తున్న మార్కెట్ చైర్మన్ యాటగీత



తుర్కయంజాల్: రైతు సేవా సహకార సంఘంలో..



యాచారం: నక్కర్తమేడిపల్లిలోని గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ వద్ద..

సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ

కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్ మాట ఇస్తే అమలు చేసి తీరుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రిపబ్లిక్‌డే సందర్భంగా నాలుగు సంక్షేమ పథకాలను ప్రారంభించడం ఆనందంగా ఉందని ఆయన చెప్పారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామానికి 122 ఇందిరమ్మ ఇళ్లు, 160 రేషన్‌కార్డులు, 11 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 1157 మంది రైతులకు రైతుభరోసా మంజూరైంది. పోలెపల్లిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రొసీడింగ్‌లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని ప్రస్తుతం సంక్షేమ పథకాలు రాని ఆందోళన చెందవద్దని, అర్హులైన వారందరికీ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, మార్కెట్‌చైర్మన్ యాట గీత, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ మాధురి, తహసీల్దార్ లలిత, ఏడీఏ ఆదిలక్ష్మి, నాయకులు నర్సింహ, జగన్, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్, మాజీ సర్పంచ్ బాల్‌రాం తదితరులు పాల్గొన్నారు. అలాగే తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభించారు.



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

శంకరయ్యగౌడ్ సేవలు చిరస్మరణీయం

కడ్తాల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి దివంగత అయిళ్ల శంకరయ్య గౌడ్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ బాలాజీసింగ్‌లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో అయిళ్ల శంకరయ్యగౌడ్ వర్ధంతి వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా శంకరయ్యగౌడ్ ఘాట్ వద్ద ఎమ్మెల్యేతో పాటు, పీసీబీ మెంబర్, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఆదిబట్ల సీఐకి సేవా పతకం



కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా పతకం స్వీకరిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల సీఐ ఎస్. రాఘవేందర్‌రెడ్డికి ఉత్తమ సేవా పతకం వరించింది. గణతంత్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ సి.నారాయణరెడ్డి సీఐ రాఘవేందర్‌రెడ్డికి ఉత్తమ సేవ పతకం అందజేశారు. మహేశ్వరం జోన్ డీసీపీ సునితారెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్‌లు సీఐ రాఘవేందర్‌రెడ్డిని అభినందించారు.

శ్రీనివాస్‌రెడ్డికి ప్రతిభ పతకం

అటవీ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ బానూని శ్రీనివాస్‌రెడ్డికి ఉత్తమ ప్రతిభతో పాటు మోడల్‌ను ఫారెస్ట్ డివిజనల్ అధికారి వేణుమాదవ్ అందజేశారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

కందుకూరు: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం గాంధీ భవన్‌లో రిపబ్లిక్ డేను పురస్కరించుకొని పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే బీజేపీ నైజం



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ నాయకుల ఆరోపణ

ఆమనగల్లు: అభివృద్ధిని అడ్డుకోవడమే బీజేపీ నేతల నైజమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజి వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌లు ఆరోపించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డిలను విమర్శించే హక్కు లేదని వారు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆమనగల్లు ప్రాంతంలో అభివృద్ధికి అడుగడుగునా అడ్డు తగులుతూ ఈ ప్రాంతం వెనుకబాటుకు ఆచారి కారణమని ఆరోఇంచారు. సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయ అవగాహన లేదని ఆచారి వ్యాఖ్యానించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిని కాంక్షించి సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చొరవ తీసుకుంటూ ఫోర్త్ సిటీ మీదుగా రేడియల్ రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ జరుపుతుంటే బీజేపీ నేతలు, ఆచారి గిరిజనులను రెచ్చగొట్టి అభివృద్ధిని అడ్డుకోవడానికి కుట్ర సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం బలవంతంగా రైతుల భూములను గుంజుకోవడం లేదని, రైతులకు నచ్చజెప్పి వారికి మెరుగైన పరిహారం అందిస్తుందని చెప్పారు. రవాణా సదుపాయం పైనే అభివృద్ధి ఆధారపడి ఉంటుందని బీజేపీ నాయకులు గుర్తుంచుకోవాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ధనుంజయ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు రాములు, ఖలీల్, నారాయణ, శ్రీకాంత్, విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, మైసయ్య పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సంబరాలు

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రకటించడంతో ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. స్థానిక పట్టణంలోని జాతీయ రహదారిపై రాజీవ్‌చౌరస్తా వద్ద మందకృష్ణమాదిగ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, బీజేపీ జిల్లా నాయకుడు సుందూరి శేఖర్, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, నాయకులు మల్లేశ్, సాయిలు, మైసయ్య, శేఖర్, జానయ్య, నర్సింహ, సుదర్శన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడికి సన్మానం

కడ్తాల్: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన అబ్బు రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ తదితరులు రమేశ్‌ను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రంగయ్య, దాసు, బాలకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రాజ్యాంగ రక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- డా.బీఆర్ అంబేడ్కర్, స్వామి వివేకానంద విగ్రహాల ఆవిష్కరణ



విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

తుర్కయంజాల్: రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని స్వామి వివేకానంద చౌరస్తాలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్, 22వ వార్డు కౌన్సిలర్ కోశిక ఐలయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్.బీఆర్.అంబేడ్కర్, స్వామి వివేకానంద విగ్రహాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్, స్వామి వివేకానందలను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడమే కాకుండా, వారు చూపిన మార్గంలో నడవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమాజంలో బాధ్యతగా మెలగాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్, కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి



జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణలో నాయకులు

కడ్తాల్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పిప్పల వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే విగ్రహాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. విద్య ప్రాధాన్యాన్ని 1850లో మొట్ట మొదటిగా గుర్తించిన మహనీయుడు పూలే అన్నారు. పేదలకు విద్యను చేరువ చేసేందుకు తన జీవితాంతం పూలే సేవలందించారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలనికోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, విగ్రహదాత తిరుమలేశ్వర్, నాయకులు రామకృష్ణ, చందోజీ, ఆంజనేయులు, నర్సింహ, వెంకటయ్యగౌడ్, రాజేశ్, రవి, జహంగీర్‌అలీ, వెంకటేశ్, బీచ్యానాయక్, సత్యంయాదవ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: జీవితంలో ఓటమి గెలుపునకు పునాది అవుతుందని ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలో కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏపీఎల్–8 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభించారు. క్రీడలు స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందిస్తాయని చైర్మన్ అన్నారు. అనంతరం గోపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. తన తండ్రి స్మారకార్థం క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈసీ శేఖర్‌గౌడ్, నాయకులు జంగయ్య, పాండురంగారెడ్డి, సాంబయ్యగౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న వీరస్వామిగౌడ్

పోటీలకు బహుమతుల వితరణ

అబ్దుల్లాపూర్‌మెట్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కవాడిపల్లి గ్రామంలో ఏటా నిర్వహించే కేపీఎల్(కవాడిపల్లి ప్రీమియర్ లీగ్) 9వ సీజన్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన బొడిగె ఆనంద్‌గౌడ్ జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు అందిస్తుండగా షీల్డ్స్ క్రీడా నిర్వాహకులకు అందజేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు ఆహ్వానం

ఆమనగల్లు: పట్టణంలోని కంఠ మహేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 30, 31వ తేదీల్లో నిర్వహించే శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలలో పాల్గొనాలని మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులుకు గౌడసంఘం నాయకులు ఆదివారం ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, అల్లాజీగౌడ్, బాలకృష్ణ, నరేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు లేక.. అవస్థలు తీరక

- నాలుగు నెలలుగా ఇబ్రహీంపట్నం, యాచారం ఏఈ పోస్టులు ఖాళీ
- ఇబ్బందులు పడుతున్న విద్యుత్ వినియోగదారులు



ఇబ్రహీంపట్నంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

ఇబ్రహీంపట్నం: విద్యుత్ శాఖలో నెలకొన్న ఖాళీలతో వినియోగదారులు, అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇబ్రహీంపట్నం, యాచారం మండలాలకు విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్లు లేక అవస్థలు పడుతున్నారు. గతేడాది అక్టోబర్‌లో విద్యుత్ శాఖ బదిలీలు చేపట్టడంతో ఇబ్రహీంపట్నం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో అసిస్టెంట్ అడిషనల్ ఇంజనీర్ సైదులు, ఏఈ శ్రీనివాస్‌రావు, లైన్ ఇన్‌స్పెక్టర్ సాయిబాబాలు మూకుమ్మడిగా బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఏడీఈగా సైదులు, లైన్ ఇన్‌స్పెక్టర్‌గా రామకృష్ణలు విధుల్లో చేరారు. బదిలీలైన ఇబ్రహీంపట్నం, యాచారం మండలాల విద్యుత్ ఏఈల స్థానంలో ఎవరూ రాలేదు. ఇబ్రహీంపట్నం ఏఈ పరిధిలో వైట్ గోల్డ్, ఇబ్రహీంపట్నం, ఇండస్ట్రీయల్‌పార్కు, రాయపోల్, దండుమైలారం సబ్‌స్టేషన్లుండగా 13 వేల గృహ, 4500 వ్యవసాయ, 2000 కమర్షియల్, ఇండస్ట్రీస్ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ బిల్లుల రూపేణ నెలకు రూ. 1.70 కోట్ల ఆదాయం సమకూరుతుంది. యాచారం మండల ఏఈ పరిధిలో 9 సబ్ స్టేషన్లు ఉండగా 8 వేలు గృహ, 4 వేలు వ్యవసాయ, 1200 కమర్షియల్, ఇండస్ట్రీస్ విద్యుత్ కనెక్షన్లున్నాయి.

పెరిగిన పనిభారం

క్షేత్ర స్థాయిలో విద్యుత్ సమస్యలు ఏర్పడిన, బ్రేక్ డౌన్ అయినా అసిస్టెంట్ ఇంజనీరు దగ్గరుండి ఆ పనులు చక్కబెట్టాలి. అంతేగాక లైన్స్ తెగిపోయిన, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిన, విద్యుత్ బిల్లుల్లో సమస్యలు తలెత్తిన, కొత్త మీటర్ల కనెక్షన్లు తీసుకోవాలన్నా, పాతవి తొలగించాలన్నా, విద్యుత్ అక్రమాలను అరికట్టలన్నా అసిస్టెంట్ ఇంజనీర్‌దే కీలకపాత్ర. వినియోగదారులకు ఏదైనా విద్యుత్ సమస్య ఎదురైతే ఎవరికీ చెప్పుకోవాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. దీంతో అడిషనల్ డివిజనల్ ఇంజనీర్‌పై ఏఈలు చేయాల్సిన పనిభారం పడుతుంది. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాలతోపాటు ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 23 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిత్యం పర్యవేక్షించాల్సిన బాధ్యత ఏడీఈకి ఉంటుంది.

తరచూ అంతరాయం



ఏ పనులు చేసినా విద్యుత్ పైనే ఆధారపడాల్సిన పరిస్థితి. సంక్రాంతి సెలవుల్లో గాలిపటాలు తీగలకు తగిలి తరచూ విద్యుత్ పంపిణీకి అంతరాయం ఏర్పడింది. ఏఈలు లేకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని దుస్థితి ఏర్పడింది.

– కిషన్, పాన్‌డబ్బా నిర్వాహకుడు

వెంటనే భర్తీ చేయాలి



మండలంలోనే అత్యధిక వినియోగదారులు ఉండటమే గాక రోజురోజుకు ఈ సంఖ్య పెరుగుతుంది. నగరానికి దగ్గరగా ఉన్న ఈ పట్టణానికి విద్యుత్ ఏఈ లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. వెంటనే పోస్టును భర్తీ చేయాలి.

– అశోక్, ఇబ్రహీంపట్నం

చర్యలు తీసుకుంటున్నాం

ఏడీఈ పరిధిలో 23 సబ్‌స్టేషన్లు చూసుకోవాల్సిన బాధ్యత ఉంది. ఇబ్రహీంపట్నం, యాచారం విద్యుత్ ఏఈ పోస్టులు మూడున్నర నెలలుగా ఖాళీగా ఉన్నాయి. బదిలీపై యాచారం వచ్చిన కొత్త ఏఈ వారం రోజుల్లోనే వెళ్లి పోయారు. పని ఒత్తిడి పెరిగినా వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సీతారాములు, ఏడీఈ